క్లుప్తంగా

శరవేగంగా నిర్మాణాలు



మద్దికెరలో తుది దశలో సచివాలయ నిర్మాణం

మద్దికెర: మండలంలోని మద్దికెర, హంప గ్రామాలలో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ కేంద్రాల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. భవనాలు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేశారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేసి కార్యాలయాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి గురువారం తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

చిప్పగిరి: బెల్డోణ సహకార సంఘం (సొసైటీ బ్యాంకు)లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని బ్యాంకు సీఈఓ హరికృష్ణ సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. మండలంలో చేయూత, రైతు నేస్తం, పంట తదితర రుణాలు మంజూరు చేశామని, సకాలంలో వడ్డీ చెల్లించని రైతులకు నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులపై స్పందించని రైతుల భూములను నిబంధనల ప్రకారం వేలం వేస్తామని హెచ్చరించారు.

అవినీతి నిర్మూలించాలి



విద్యార్థులతో నేషనల్ యాంటీ కరెప్షన్ కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: అవినీతి నిర్మూలనపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని నేషనల్ యాంటీ కరెప్షన్ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి రోజా షేక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలను సందర్శించిన అనంతరం వారు మాట్లాడారు. ఇందులో భాగంగా పలు విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహారాష్ట్ర కమిటీ కార్యదర్శి మహబుబ్‌బాష, ఏపీ ఇన్‌చార్జ్ మాదుగుండు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిర్మించిన టిడ్కో గృహాలకు (365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగులు) ఔత్సాహికులైన వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. దరఖాస్తు చేయదలచిన వారు వారి ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాత మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సిబ్బందిని సంప్రదించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామతీర్థం ఆమ్రేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సమాల చార్లెస్‌లు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. గ్రామ అధ్యక్షుడిగా శ్యాంసన్, ఉపాధ్యక్షులుగా చిన్నదానం, 19 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కృష్ణగిరి: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డోన్ సబ్ యూనిట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మురుగు కాల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించారు. దోమల వ్యాప్తిని అరికట్టకపోతే మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ముందు జాగ్రత్తగా అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించామన్నారు. స్థానిక వైద్య సిబ్బంది వెంట ఉన్నారు.

చంద్రయాన్–3 విజయోత్సవ సంబరాలు



పత్తికొండలో వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు

పత్తికొండ రూరల్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో అంతరిక్ష రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పత్తికొండలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. జాతీయ జెండాలు చేతబట్టుకుని భారత్ మాతాకీ జై.. వందేమాతరం అని నినదించారు. ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్ తదితరులు మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ

- సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఇంటి వద్దకే వచ్చాం
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఎల్.కొట్టాల గ్రామంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్.కొట్టాల గ్రామంలో గురువారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ ఎల్.నగరం సమీర్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించడంతో పాటు బాణాసంచా పేల్చి హోరెత్తించారు. ప్రజాభిమానానికి ముగ్ధురాలవుతూనే 'మీ ఇంటి వద్దకే వచ్చాం.. సమస్యలేమైనా ఉంటే చెప్పండి' సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం అంటూ ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ఆరా తీశారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలిస్తూ, తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే తాము ఉంటామని, ప్రతి గడపలో ప్రజలు ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా సమస్యలు గుర్తించి, మేనిఫెస్టోలో పేర్కొన్న, పేర్కొనని ఎన్నో పథకాలను అమలు పరుస్తూ, అభివృద్ధి సాధిస్తూ సీఎం జగనన్న ప్రజాభిమానం పొందుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గోవర్ధనగిరి ప్రధాన రహదారి నుంచి ఎల్.కొట్టాల గ్రామానికి సిమెంట్ రోడ్డు సౌకర్యం కల్పించినట్లు గుర్తుచేశారు. గ్రామ సచివాలయానికి మంజూరుచేసిన రూ.20 లక్షల నిధులో స్థానిక సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మాలిక్‌బాష, మోహన్ రెడ్డి, శరభారెడ్డి, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన కొలతలతో రీసర్వే



పుల్లగుమ్మిలో సరిహద్దు రాయికి పూజలు చేస్తున్న డివిజనల్ సర్వేయర్ సుబ్బారెడ్డి

వెల్దుర్తి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని పుల్లగుమ్మి గ్రామ పరిధిలో సరిహద్దు రాళ్ల ఏర్పాటు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. డివిజనల్ సర్వేయర్ సుబ్బారెడ్డి, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి, ఎంపీటీసీ నాగార్జున రెడ్డి గ్రామ రైతు చింతమాను వెంకట్రాముడు పొలం, ప్రభుత్వ భూమికి మధ్య హద్దు రాయికి పూజాది కార్యక్రమాలు చేసి పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేశంలో ఎక్కడా లేని విధంగా వందేళ్ల తర్వాత భూముల సమగ్ర సర్వే చేపట్టిందన్నారు. ప్రజలపై ఒక్క పైసా భారం పడకుండా సర్వే చేయడంతోపాటు, హద్దు రాళ్లు ఏర్పాటు చేసి భూ యజమానులకు హక్కు పత్రాలు అందిస్తారన్నారు. డివిజనల్, మండల సర్వేయర్లు మాట్లాడుతూ.. ప్రతి భూ కమతాన్ని అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా మార్కింగ్ చేసి నంబర్ కేటాయిస్తారని, సదరు భూమి తెలిసేలా క్యూఆర్ కోడ్ రూపొందిస్తున్నామన్నారు. ఈ రికార్డులు ట్యాంపరింగ్ చేయడం సాధ్యం కాదని, సమగ్ర సర్వేతో భూ వివాదాలు పరిష్కారమవుతాయన్నారు. పుల్లగుమ్మి పరిధిలోని 1464.50 ఎకరాల రీసర్వే పూర్తి చేశామని, ఇందుకు అవసరమైన 1350 హద్దు రాళ్లను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. పక్షం రోజుల్లో సర్వే రాళ్ల ఏర్పాటు పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర్లు, గ్రామ రెవెన్యూ అధికారి ఎల్లకృష్ణ, విలేజ్ సర్వేయర్లు ఇబ్రహీం, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం పరిధిలో పనిచేస్తూ కోవిడ్‌తో, ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ ఆయా కార్మిక కుటుంబాల సభ్యులు బంగారమ్మ, ఉసేన్‌బీ, ఆశాజ్యోతి, ముత్తులక్ష్మి, మారెమ్మ కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చి తమ సమస్యలను తెలిపారు. మున్సిపాలిటీలో 8 మంది కాంట్రాక్టు కార్మికులు అనారోగ్యంతో మృతి చెందారని నాలుగేళ్లు గడుస్తున్నా అయా కుటుంబాల్లో ఎవరికీ ఎలాంటి ఉపాధిఅవకాశాలు కల్పించలేదని వాపోయారు. కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు.

కురువలు చైతన్యం కావాలి



కురువల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ

హొళగుంద: కురువలు చైతన్యవంతులు అయినప్పుడే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా రాణిస్తారని బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ అన్నారు. గురువారం ఆమె భర్త, పారిశ్రామికవేత్త కృష్ణమోహన్‌తో కలిసి హొళగుందలో కురువల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అనాదిగా కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కురువలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారన్నారు. ఆలూరు నియోజకవర్గంలో 65 వేల మంది కురువ ఓటర్లు ఉన్నారని, మాటకు కట్టుబడి ఉండే కురువల్లో నాయకత్వ లక్షణాలున్నాయన్నారు. అన్ని విధాలుగా ముందుకెళ్లేందుకు త్వరలో ఆలూరులో కురువ మహా గర్జన పేరిట భారీ సభ నిర్వహించి కురువలందరిని జాగృతి చేద్దామని పిలుపునిచ్చారు. తాలూకాలోని 6 మండలాల్లో కనకదాసు విగ్రహాలను ప్రతిష్టించుకుందామని అందుకు తమ సహకారం ఉంటుందని చెప్పారు. ఐకమత్యంతో కార్యచరణ ప్రణాళికను తయారు చేసుకొని అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. కురువ సంఘం గౌరవాధ్యక్షుడు కాశీకప్రసాద్, కుల పెద్దలు దర్గన్న, శేషన్న, బొజ్జన్న, గర్జప్ప, బీరప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

15 లోపు పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత

గోనెగండ్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు సెప్టెంబర్ 15వ తేదీలోపు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత సూచించారు. గురువారం వారు మండలంలోని బి.అగ్రహారం, బైలుప్పల, గంజిహళ్లి గ్రామాల్లోని పంట పొలాల్లో ఆర్‌బీకే సిబ్బంది చేపట్టిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతు సాగుచేసిన ప్రతి పంటను పంట నమోదు చేయాలని, పంట విస్తీర్ణం, పంట రకాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు. పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని రైతులకు తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి, కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచాలని సిబ్బంది సూచించారు.

దోమల నివారణకు చర్యలు



గంబుషియా చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పట్టణంలో దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, జిల్లా అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణ శివారు ప్రాంతాల్లోని మురికి గుంటల్లో గురువారం గంబుషియా చేపలను వదిలారు. వారు మాట్లాడుతూ పట్టణ వాసులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక సబ్‌యూనిట్ అధికారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: దోమల నివారణకు నిల్వ ఉన్న నీటిలో గాంబుషియా చేప పిల్లలను వదిలినట్లు జిల్లా అదనపు మలేరియా నివారణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం గోనెగండ్లలో ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఉన్న కుంట, చింతలాముని స్వామి దేవాలయం వద్ద బావిలో 2 వేల గాంబుషియా చేప పిల్లలను వదిలారు. ఆయన మాట్లాడుతూ.. ఈ చేపలు నీటిలోని దోమల గుడ్లు, లార్వాను ఆహారంగా తీసుకొని దోమలు వృద్ధి చెందకుండా నివారిస్తాయన్నారు.

సమ్మతగేరి రోడ్డుకు మహర్దశ



తారు రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

హొళగుంద: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చొరవతో దశబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోని సమ్మతగేరి రోడ్డు కొత్త రూపు తెచ్చుకుంది. దాదాపు 2.5 కి.మీ దూరం ఉన్న గ్రామానికి చేరుకోవడానికి నిత్యం ప్రయాణంలో నరకం చూసే ప్రజలకు త్వరలోనే కష్టాలు తీరనున్నాయి. మంత్రి గుమ్మనూరు జయరాం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామానికి తారు రోడ్డు ఏర్పాటు చేసేందుకు రూ.1.20 కోట్లు మంజూరు చేయించడంతో గురువారం పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మికాంత్, పీఆర్ వర్క్ ఇన్స్‌పెక్టర్ నాగరాజుతో పాటు గ్రామస్తుల సమక్షంలో కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డి పూజలు నిర్వహించి తారు రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన మంత్రి గుమ్మనూరు జయరాంకు గ్రామ నాయకులు తప్పెట శోభరామిరెడ్డి, రామిరెడ్డి, అడ్వకేట్ లక్ష్మికాంత్, కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎస్‌ఐ డాక్టర్ నాయక్

ఆలూరు రూరల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆలూరు ఎస్‌ఐ డాక్టర్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'విద్య ప్రాముఖ్యత– విద్యను నిర్లక్ష్యం చేయడంతో కలిగే నష్టాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎస్‌ఐ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. వీటిని అందిపుచ్చుకుని కష్టపడి చదివి ఉన్న స్థాయికి ఎదగాలన్నారు. మంచి సమాచారం కోసం మాత్రమే సెల్ ఫోన్లు వాడాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వీరేష్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు గోవర్ధన్, మండల కార్యదర్శి లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టు షెడ్డుకు నిప్పు

తుగ్గలి: చెన్నంపల్లి గ్రామ సచివాలయ కన్వీనర్, కొత్తపల్లి గుడిసెల గ్రామ రైతు సుధాకర్‌కు చెందిన పట్టు పురుగుల షెడ్డుకు గిట్టని వారు నిప్పు పెట్టారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. సుధాకర్ నాలుగెకరాలలో పట్టు పురుగుల పెంపకం చేపట్టాడు. 2017లో పొలంలో పట్టు పురుగుల షెడ్డు నిర్మించుకొని వచ్చిన దాంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గిట్టని వారు బుధవారం అర్ధరాత్రి షెడ్డుకు నిప్పు పెట్టారు. విషయం తెలుసుకొని అక్కడి వెళ్లేలోగా షెడ్డు మొత్తం కాలి బూడిదైంది. దాదాపు రూ.15 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు, కుటుంబ సభ్యులు విలపించారు. జొన్నగిరి ఎస్‌ఐ రామాంజనేయులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాథరెడ్డి, తిమ్మారెడ్డి, నాగిరెడ్డి, వెంకటయ్య వెళ్లి బాధిత రైతును ఓదార్చారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతును ఆదుకునేలా చూస్తామన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటితే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 21వ వార్డు హెచ్‌బీఎస్ కాలనీలో కాలువ వెంట వార్డు ఇన్‌చార్జ్ మురహరి రాజశేఖర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సయ్యద్‌చాంద్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు: కురుబ కులస్తుల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాదాసి మాదారి కురుబ సంఘం నాయకులు గురువారం ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కొందరు సంఘ విద్రోహులు కావాలనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, ఎల్లార్తి రోడ్డు సమీపంలోని విగ్రహం ధ్వంసానికి పాల్పడిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరా రు. సంఘం నాయకులు ఎస్‌కే గిరి, తిప్పేష్, మరిమల్ల, లింగమూర్తి, రమేష్ తదితరులు ఉన్నారు.

నీటి పంపింగ్‌కు చర్యలు

మద్దికెర: మండల కేంద్రంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఈఓ శ్రీహరి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు అన్నారు. గురువారం హంద్రీనీవా కాలువ వద్ద ఉన్న పంపింగ్‌హౌస్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటిని పంపింగ్ చేయడానికి మోటార్లు సిద్ధం చేశామన్నారు. నేటి నుంచి ప్రారంభించి స్థానిక మద్దమ్మ చెరువుకు పంపింగ్ చేస్తామన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని మల్లికార్జున, రమేష్ తదితరులు కోరారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై సెప్టెంబర్ 15న విజయవాడలో నిర్వహించే శంఖారావ కరపత్రాలను పట్టణంలో గురువారం వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బాధితులకు సంపూర్ణ న్యాయం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్షం కోసం గాయత్రీ మంత్ర జపం



పంచముఖి గాయత్రీ మాత ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆలయంలో గురువారం శంకరబండ గ్రామానికి చెందిన భక్తులు వర్షాలు కురవాలని కోరుతూ గాయత్రీ మాత జపం చేస్తూ భజన చేపట్టారు. రామలింగేశ్వర స్వామి కొలను నుంచి నీటిని తెచ్చి ఆలయంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతులు తదితర పూజలు నిర్వహించారు. రామతీర్థానికి కి.మీ దూరంలో ఉన్న శంకరబండ గ్రామానికి చెందిన మహిళలు కలశాలు, 108 నీళ్ల బిందెలతో గాయత్రీ నామ స్మరణ చేస్తూ అమ్మవారి ఆలయం చేరుకొని నిండు బిందెలను ఉంచారు. భక్తులు తెచ్చిన నీటితో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గాయత్రీ మాతకు జలాభిషేకం చేయనున్నట్లు ఆలయ అర్చకుడు రూపామోహన్‌శర్మ తెలిపారు. సర్పంచ్ విజయలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

మద్దికెర: బసినేపల్లి గ్రామంలో గురువారం వర్షం కోసం గ్రామ ప్రజలు కాశింతాత స్వామి వారిని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. అనంతరం స్వామి వారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చదివింపులు నిర్వహించారు. ప్రజలకు ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ.. స్వామి వారి ఊరేగింపు నిర్వహించి పూజలు చేస్తే తప్పనిసరిగా వర్షాలు కురుస్తాయనే నమ్మకం ఉందన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



కక్షిదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: సెప్టెంబరు 8న నిర్వహించే నేషనల్ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ తిమ్మయ్య సూచించారు. గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నందవరం స్టేషన్ పరిధిలో 107 కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం 10 కేసులకు సంబంధించి ఇరువర్గాల కక్షిదారులతో మాట్లాడి రాజీ మార్గాలు చూపించామన్నారు. కాంపౌండబుల్ కేసులు, కుటుంబ తగాదాలు, క్రిమినల్, గుట్కా, న్యూసెన్స్ కేసులు, పొలం తగాదాలు తదితర కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 7 తేదీ వరకు పెండింగ్ కేసులకు సంబంధించి కౌన్సెలింగ్ ఉంటుందని, 8న మెగా లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు.

పంటల సాగుపై శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారులు

దేవనకొండ: మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య పద్ధతులపై ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏఓ సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. డీఆర్‌సీ నుంచి ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పంటలు, యాజమాన్య పద్ధతులపై వివరించారు. పంటల్లో తెల్లదోమ, పచ్చదోమ, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై వివరించారు. వీటి నివారణకు 5 ఎంఎల్ వేపనూనె, 2.5 గ్రాముల ఆసిఫేట్, ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. మిరప పంటలో ఎకరాకు 30 పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎరువులు తగిన మోతాదులో వాడాలని సూచించారు. ఏఓ శశిధర్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు రంగన్న, యోగేంద్రబాబు, మానస, ఎంపీటీసీ తిమ్మప్ప ఉన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంతోని

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు బదులిచ్చారు. మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రజాప్రతినిధులు విద్యా శాఖ అధికారులను కోరారు. స్పందించిన ఎంఈఓ ఈరన్న మాట్లాడుతూ.. ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి కూడా తీసుకెళ్లామని త్వరలోనే టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు సభ దృష్టికి తీసుకురాగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్న స్పందిస్తూ నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయించి సక్రమంగా నీటి సరఫరా చేస్తామని చెప్పారు. ఎంపీడీఓ ఆంతోని, వైస్ ఎంపీపీ నాగేష్, ఈఓపీఆర్డీ మల్లికార్జున, చింతకుంట సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఓ శివశంకర్, సర్పంచులు నాగేంద్ర, మల్లికార్జున, ఉలిగప్ప, గాదిలింగప్ప, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గొల్ల కేశన్న

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మండల అధ్యక్షుడు గొల్ల కేశన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గొల్ల కేశన్న ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. కొందరు సర్పంచులు తమ పంచాయతీ నిధులు ఇతర పనులకు వాడుకుంటున్నారని వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలున్నట్లు అధికారుల దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మండల ఉపాధ్యక్షుడు పాలయ్య, ఎంపీడీఓ బంగారమ్మ, ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్‌రాజు, ఎన్నికల డీటీ గురురాజరావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న నాటుసారా, బైక్‌లతో పోలీసులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని జెఎం.తండా గ్రామంలోని నాటుసారా స్థావరాలపై డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. 100 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని పలుచోట్ల ఆకస్మికంగా దాడులు నిర్వహించి 2 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. రికార్డులు సక్రమంగా లేని 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పత్తికొండ, తుగ్గలి, దేవనకొండ, జొన్నగిరి, మద్దికెర ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, భూపాలుడు, రామాంజినేయులు, రిజ్వాన్, 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.